సాక్షి
వరంగల్

శుక్రవారం | 25 | ఆగస్టు | 2023



చిగురించిన ఆశలు..

సుదీర్ఘకాలంగా టీచర్ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్న అభ్యర్థులకు శుభవార్త. త్వరలోనే పోస్టులు భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి వెల్లడించారు. - 8లో▸



మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పొదుపు సంఘాల బలోపేతమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, రుణాలు పొందిన మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వే సమర్థవంతంగా చేపట్టాలి



కాశీబుగ్గ సెంటర్: ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.సారయ్య విద్యార్థులకు సూచించారు. నగరంలోని శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం శారదాబాయి అధ్యక్షతన టీటీసీ, డిగ్రీ విద్యార్థులకు ఎఫ్‌ఎల్‌ఎన్ ఫౌండేషన్, లిట్రసీ, న్యూమరసీ సర్వే గురించి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన సారయ్య మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ పొంది ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వేను సమగ్రంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రెయినీలు వేముల నరేష్, కొమ్ము శ్రీధర్, చిలువేరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

కాశీబుగ్గ సెంటర్: రాష్ట్ర సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ఎంపిక చేసిన ప్రత్యేక అవసరాలు గల (దివ్యాంగులు) విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ, ఏఎల్ఐఎంసీఓ అధ్వర్యంలో శుక్రవారం శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉచిత ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని 159 దివ్యాంగ విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆమె పేర్కొన్నారు. వీల్‌చైర్స్, ట్రై సైకిల్స్, రోలేటర్స్, ఎంఎస్ఐఈడీ కిట్స్, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, చంక కర్రలు, కాలిపర్స్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన దివ్యాంగ విద్యార్థులు అందరూ హాజరయ్యేలా చూడాలని ఆయా మండలాల ఐఈఆర్పీలకు సూచించారు.

బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా రాంబాబు



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారానికి చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గట్టికొప్పుల రాంబాబు పార్టీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబును జిల్లా, మండల నాయకులు అభినందించారు.

'మనుషత్వం' పుస్తకావిష్కరణ



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు డి.దుర్గాచారి రచించిన రచించిన 'మనుషత్వం–సాంగ్స్ ఆఫ్ హ్యూమనిటీ' పుస్తకాన్ని డీఈఓ వాసంతి ఆవిష్కరించారు. గురువారం పాఠశాలలో పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా డీఈఓ, ఉపాధ్యాయులు.. రచయితను అభినందించారు. అనంతరం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎస్ఎంసీ సభ్యులు, పొదుపు సంఘాల మహిళలు మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, సృజనాత్మకతను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. హెచ్‌ఎం టి.సుజాత, ఎంఈఓ చదువుల సత్యనారాయణ, ఎస్ఎంసీ సభ్యులు కొక్కొండ శ్రీకాంత్, గోదాసి రమేశ్ పాల్గొన్నారు.

మరియపురంలో ట్రెయినీ అధికారుల పర్యటన




గీసుకొండ: మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీ మరియపురంలో మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్ ట్రెయినీ అధికారుల బృందం పర్యటన కొనసాగుతోంది. గురువారం గ్రూపు లీడర్ రవి యాదవ్, సభ్యులు శ్రీకృష్ణన్ యాదవ్, ఇమ్మాన్యుయల్ శ్రీవాత్సవ, ఆకాశ్ మీనా బతుకమ్మ వేదిక, డంపింగ్‌యార్డులో వర్మీ కంపోస్టు తయారీ, సిరామిక్ ఫ్యాక్టరీ, మంకీ ఫుడ్ కోర్టును పరిశీలించారు. సర్పంచ్ అల్లం బాలిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వప్న వారికి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ నెల 26 వరకు ఈ బృందం గ్రామంలోనే బస చేయనుంది.

ఆపదలో 'అమ్మ'

తగ్గుతున్న బాలికల నిష్పత్తి

- ఏప్రిల్ ఒకటి నుంచి ఆగస్టు 22 వరకు 3,830 మంది శిశువుల జననం
- అందులో 2,045 మంది మగ శిశువులు.. 1785 మంది ఆడ శిశువులు
- కొనసాగుతున్న లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు..!

వివక్ష వేళ్లూనుకుంటోంది. గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ జరుగుతోంది. ఆడపిల్ల అని తెలిస్తే కడుపులోనే చిదిమేస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా.. భ్రూణ హత్యలు ఆగట్లేదు. కొన్నాళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆడశిశువుల జననాలు తగ్గుతున్నాయి. ఇటీవల లింగ నిర్ధారణ ముఠా అరెస్టయినా.. మరికొన్ని చోట్ల యథేచ్ఛగా ఈ దందా సాగుతోందనే విమర్శలున్నాయి. అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్ తరాలకు 'అమ్మ' కరువయ్యే ప్రమాదం ఉంది. – సాక్షి, వరంగల్



జననాల్లో బాలికల నిష్పత్తి రోజురోజుకూ తగ్గుతూ వస్తోంది. చదువు, సంస్కారం ఉన్నవారు సైతం అమ్మాయిపై వివక్ష చూపుతూనే ఉన్నారు. ఎన్ని చట్టాలు ఉన్నా.. ప్రమాదం నుంచి మాతృత్వాన్ని కాపాడలేక పోతున్నారు. వరంగల్ నగరంతో పాటు జిల్లాలో ఈ ఏడాది మే ఒకటి నుంచి ఆగస్టు 22 వరకు 3,830 మంది శిశువులు జన్మించారు. ఇందులో 2,045 మంది మగ శిశువులు ఉంటే.. ఆడ పిల్లలు 1,785 మంది ఉన్నారు. లింగ నిష్పత్తి పరిశీలిస్తే 260 సంఖ్య తేడా కనిపిస్తోంది. ఇది జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిక గణాంకాల ప్రకారమే. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలతో పాటు భ్రూణ హత్యలు జరుగుతున్నాయనడానికి ఈ లెక్కలే నిదర్శనమనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇప్పటికే మే 29న లింగ నిర్ధారణ పరీక్షలతో సంబంధమున్న ప్రభుత్వ వైద్యులతో సహా 18 మందిని వరంగల్ కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేయడం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయినా ఇప్పటికీ వరంగల్ నగరంతో పాటు నర్సంపేట తదితర ప్రాంతాల్లోని వివిధ ఆస్పత్రులు, క్లినిక్‌ల్లో గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తెలుస్తోంది.

అధికారుల నిర్లక్ష్యం..

ముఖ్యంగా వైద్యారోగ్య శాఖ విభాగాధికారుల నిర్లక్ష్యంతోనే ఆయా ఆస్పత్రులు, క్లినిక్, స్కానింగ్ కేంద్రాల్లో యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షల దందా సాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జిల్లా మల్టీ మెంబర్ అప్రోప్రైట్ అథారిటీ అధ్యక్షతన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంలో దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ సెంటర్లకు అనుమతిచ్చారు. 2001 నుంచి పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ కింద అల్ట్రా సౌండ్ స్కానింగ్ క్లినిక్‌లు, ఇమేజింగ్ సెంటర్లు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ అయినవి 102 ఉంటే.. 68 మాత్రమే నడుస్తున్నాయని, 34 నడవడంలేదని వైద్యాధికారులు చెబుతున్నారు.

కఠినంగా వ్యవహరించాల్సిందే..

కేసీఆర్ కిట్ ప్రకారం జిల్లాలో 1,000 మంది మగ పిల్లలకు ఆరేళ్ల పిల్లలు 873 మంది మాత్రమే ఉండడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఇటు ఆస్పత్రులు, అటు స్కానింగ్ కేంద్రాల్లోని బోర్డులపై లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని ప్రదర్శిస్తున్నా కొందరు వైద్యులు కాసుల కక్కుర్తితో ఆడ పిల్లలను కడుపులోనే చిదిమేస్తున్నారన్న విషయాన్ని మూడు నెలల క్రితం పోలీసుల దాడుల్లో పట్టుబడిన లింగ నిర్ధారణ ముఠాతో బహిర్గతమైంది. అయినా ఇప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా ఎక్కడికక్కడా లింగ నిర్ధారణ పరీక్షలు, ఆపై భ్రూణహత్యలు జరుగుతున్నాయనే ఆరోపణలుండడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై జిల్లావైద్యారోగ్య అధికారులు కఠినంగా వ్యవహరిస్తేనే ఆడపిల్లల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న వాదన బలంగా వినిపిస్తోంది.

ఏప్రిల్ ఒకటి నుంచి ఈనెల 22 వరకు జన్మించిన శిశువుల గణాంకాలిలా..

మండలం	బాలురు	బాలికలు
దుగ్గొండి	95	68
పర్వతగిరి	119	89
నెక్కొండ	104	78
సంగెం	107	83
రాయపర్తి	139	109
నర్సంపేట	169	133
ఖానాపురం	71	58
వరంగల్	392	341
చెన్నారావుపేట	119	106
ఖిలావరంగల్	453	427
వర్ధన్నపేట	108	105
నల్లబెల్లి	73	77
గీసుకొండ	96	111
మొత్తం	2,045	1785

లింగ వ్యత్యాసంపై అధ్యయనం చేస్తాం..



దుగ్గొండి మండలంలో 95 మంది మగ పిల్లలు పుడితే 68 మంది మాత్రమే ఆడ పిల్లలు ఉన్నారు. దీనికి విరుద్ధంగా గీసుగొండ మండలంలో 96 మంది మగపిల్లలు పుడితే 111 మంది ఆడ పిల్లలు జన్మించారు. లింగ వ్యత్యాసం అధికంగా ఉన్న మండలాల్లో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలకు శ్రీకారం చుడతాం. భవిష్యత్‌లో ఎదురయ్యే పరిణామాల గురించి వివరిస్తాం. అలాగే ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల కార్యకలాపాలపై నిఘా ఉంచుతాం.
– డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్యారోగ్యాధికారి, వరంగల్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు

వరంగల్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు, అనవసరమైన అబార్షన్లు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ హెచ్చరించారు. వరంగల్‌లోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. లింగ నిర్ధారణ సెంటర్, ఫామ్ ఎఫ్ ఆడిట్, రిజిస్టర్లను పరిశీలించి సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి హార్డ్ కాపీని ప్రతినెలా 5వ తేదీలోపు జిల్లా కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, స్టాటిస్టికల్ ఆఫీసర్ విజయలక్ష్మి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



సంరక్ష ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



దివ్యాంగులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం దివ్యాంగులకు ఆసరా పింఛన్ పెంపునకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 6,181 మంది దివ్యాంగులకు నెలకు రూ.4016 చొప్పున రూ.2,48,22,896 మొత్తాన్ని విడుదల చేసినట్లు తెలిపారు. దివ్యాంగులకు మీటింగ్ హాల్ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 90 మంది లబ్ధిదారులకు రూ.23.50 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై చేరికలు

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎంతో మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు, నెక్కొండ మండలం అమీన్‌పేటకు చెందిన 40 కుటుంబాలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరాయి. వారికి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఖానాపురం : విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు



నెక్కొండ : ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపురం: మండలంలోని అశోక్‌నగర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మంజుల తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను గురువారం అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో కార్తీక్, వంశీకృష్ణ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ సుభద్ర, ఉపాధ్యాయులు పద్మావతి, కవిత, సరస్వతి, సునీత, రహీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

సూరిపల్లి పాఠశాల విద్యార్థులు..

నెక్కొండ: రాష్ట్రస్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు సూరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఉండ్రాతి సుజన్‌తేజ తెలిపారు. పాఠశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలోని శివాని హైస్కూల్‌లో నిర్వహించిన టార్గెట్ బాల్ క్రీడా పోటీల్లో విద్యార్థులు గుగులోతు శివ, భూక్యా జగన్, ఆంగోతు వంశీ, బానోతు అంజన్న, జాటోతు గణేష్, కొంకాల దినేష్, భూక్యా ప్రసాద్ ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో అదే పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ప్రమోద్‌కుమార్, పీఈటీ కోట రాంబాబు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్, జోగయ్య, రమేష్, అన్నపూర్ణ, వెంకటలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ పరకాల వెంకటమల్లు, సర్పంచ్ సింగారపు గీత, ఎంపీటీసీ శారద, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 13 మంది డీబార్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గురువారం నిర్వహించిన దూరవిద్య బీఏ, బీకాం, బీఎస్సీ ఫస్టియర్ పరీక్షల్లో 13 మంది విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతూ డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. వరంగల్‌లోని లాల్‌బహదూర్ కళాశాలలో ఆరుగురు, ఏఎస్ఎంలో ఐదుగురు, చందా కాంతయ్య మెమోరియల్ కళాశాలలో ఇద్దరు స్క్వాడ్‌కు పట్టుబడినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక పురోభివృద్ధిలో 'ఆశాజ్యోతి'



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దయాకర్

చెన్నారావుపేట: ఆశాజ్యోతి మండల సమాఖ్య ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తోందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దయాకర్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మ్యాక్స్ యాక్ట్ నిబంధనపై గ్రామ సంఘం ప్రతినిధులు, వీఓఏలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంఘాల నాయకత్వ మార్పిడి, విధులు, బాధ్యతలను వివరించారు. అనంతరం దయాకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా 100 రోజులు పూర్తి చేసిన కుటుంబ సభ్యులు ఉచిత శిక్షణ, స్కాలర్‌షిప్‌తో పాటు ఉద్యోగ కల్పనకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దీంతో పలు రకాల ఉపాధి అవకాశాలను ప్రాజెక్టు ద్వారా కల్పిస్తున్నామని వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపికలో గ్రామ సంఘాల వీఓఏలు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఏపీఎంలు ముక్కెర ఈశ్వర్, ఎర్రబెల్లి వేణుగోపాల్, సీసీలు కట్టయ్య, మంజుల, వెంకటేశ్వర్లు, సుజాత, సమాఖ్య ప్రతినిధులు లక్ష్మి, సాల్కి, సుజాత, సరోజ, ఎంఎస్ఏ రజిత, ఉమ, సీఏలు ఆస్మా, మంజుల, సుధా, శ్యాం, శరత్ పాల్గొన్నారు.

జింక్ లోపం నుంచి పంటలను కాపాడుకోవాలి



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్

రాయపర్తి: జింక్ లోపం నుంచి పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ సూచించారు. కేశవాపురం, ఎర్రకుంటతండా గ్రామాల్లో వరి, పత్తి పంటలను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జింక్ లోపం నివారణకు లీటరు నీటికి 2గ్రాముల చొప్పున జింక్ సల్ఫేట్ కలిపి ఐదు రోజుల తేడాతో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. కాండం తొలిచే పురుగు నివారణ కోసం కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరాకు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరాకు 8 కిలోలు వేసుకోవాలన్నారు. క్లోరాంటనిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్లను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగు నివారణకు అసిఫేట్ 300 గ్రాములు, వేప నూనెను ఒకలీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తిలో లింగాకర్షక బుట్టలను ఎకరాకు 4 నుంచి 8 చొప్పున సామూహికంగా ఏర్పాటు చేసుకొని గులాబీ రంగు పురుగు ఉధృతి అరికట్టాలన్నారు. యూరియా 30 కిలోలు 10 కిలోల పొటాష్ భూమిలో పదును ఉన్నపుడు మొక్క పక్కన తోడి పెట్టాలన్నారు. ఎస్ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ పి.సారంగం, ఏఈఓ హిమబిందు, సర్పంచ్ బీకోజీ, రైతులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి : టీపీటీఎఫ్

దుగ్గొండి: ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ అన్నారు. మండలంలోని తొగర్రాయి, లక్ష్మీపురం, నాచినపల్లి, దేశాయిపల్లి, పొనకల్ గ్రామాల్లో గురువారం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో విద్యారంగానికి బడ్జెట్‌లో 12 శాతం నిధులు కేటాయించారని గుర్తుచేశారు. తెలంగాణలో 6 శాతమే కేటాయిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో 22 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు పోరుబాట పట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశాల్లో జి.వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్, అశోక్, సురేష్, ఈదుల వీరస్వామి, వీరగోని స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సాగులో యాంత్రీకరణ

- నర్సంపేట నియోజకవర్గానికి రూ.75 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ
- 50 శాతం రాయితీపై రూ.37.5 కోట్ల నిధులు విడుదల
- 63 వేల మంది రైతులకు వ్యవసాయ పనిముట్లు
- వ్యవసాయ మార్కెట్‌లో 25, 26 తేదీల్లో పరికరాల ప్రదర్శన

నర్సంపేట రూరల్: వ్యవసాయం రైతులకు రోజురోజుకు భారమవుతోంది. కూలి రేట్ల పెరుగుదల, కూలీల కొరత, ప్రకృతి విపత్తులతో ఇబ్బందులు పడుతున్నారు. తద్వారా దిగుబడి తగ్గడంతో పంటల సాగుపై సరిగా దృష్టిసారించలేక పోతున్నారు. వీటన్నంటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రాయితీపై అధునాతన పనిముట్లు, యంత్రాలను అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో వరుసగా రెండు సంవత్సరాలు పంటలు నష్టపోయిన రాష్ట్రంలోని నర్సంపేట, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించింది. యాంత్రీకరణ కోసం రూ.75 కోట్ల చొప్పున నిధులు కేటాయించి.. 50 శాతం రాయితీపై రూ.37.5 కోట్ల చొప్పున నిధులు విడుదల చేసింది. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చొరవతో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఈనెల 25,26 తేదీల్లో మొదటిసారిగా వ్యవసాయ పరికరాలు, యంత్రాల ప్రదర్శన నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దేశం నలుమూలల నుంచి పలు కంపెనీలు ప్రదర్శనలో పాల్గొననున్నాయి. నియోజకవర్గానికి చెందిన 63 వేల మంది రైతులకు 50 శాతం రాయితీపై పరికరాలు అందిస్తారు.

పార్టీలకతీతంగా రైతులకు పనిముట్లు



వ్యవసాయ మార్కెట్‌లో పనిముట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : రైతులకు పార్టీలకతీతంగా సబ్సిడీపై పనిముట్లు అందించనున్నట్లు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ పరికరాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ రైతులకు పనిముట్లు, యంత్రాలను అందించేందుకు ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రభుత్వం రూ.75 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. 50 శాతం సబ్సిడీతో రూ.37 కోట్ల 50 లక్షల నిధులు ప్రత్యేకంగా విడుదల చేసిందని తెలిపారు. అనంతరం మార్చిలో కురిసిన వడగండ్ల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు చెక్కులు అందిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఏడీఏ తోట శ్రీనివాస్‌రావు, అధికారులు ఉన్నారు.

రైతులకు ఎంతో మేలు



రెండేళ్లుగా వడగండ్ల వానతో పంటలు నష్టపోయి రైతులు దిగాలు చెందుతున్నారు. పెట్టినపెట్టుబడులు రాక మరింత అప్పుల పాలవుతున్నారు. వారి కోసం నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి.. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి అధునాతన యంత్రాల కోసం 50 శాతం రాయితీతో నిధులు తీసుకురావడం చాలా సంతోషంగా ఉంది. ఈ పనిముట్లతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.
– కట్ల సుధాకర్, ఇటుకాలపల్లి రైతు

సద్వినియోగం చేసుకోవాలి



వ్యవసాయం రైతులకు భారంగా మారుతోంది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా నూతన సాంకేతికతతో కూడిన యంత్రాలు, డ్రోన్లు, పనిముట్లు రైతులకు 50 శాతం రాయితీపై అందించనుంది. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి.. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడి రూ.37.5 కోట్ల నిధులు సైతం మంజూరు చేయించారు. రైతులు పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలి. – తోట శ్రీనివాసరావు, ఏడీఏ

విధుల్లో నిర్లక్ష్యం వద్దు



ప్రజావేదికలో మాట్లాడుతున్న అదనపు పీడీ వసుమతి

చెన్నారావుపేట: విధుల్లో ఈజీఎస్ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకూడదని ఉపాధిహామీ అదనపు పీడీ వసుమతి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం కూడా జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ పనుల రికార్డులను ఆమె పరిశీలించారు. పనులు కల్పించినప్పుడు హాజరు పట్టిక, రిజిస్టర్లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. జాబ్ కార్డులు లేనివారికి అందించాలన్నారు. ఎంపీపీ విజేందర్, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్ రాజు, సూపరింటెండెంట్ దయాకర్, ఏపీఓ అరుణ, ఎస్ఆర్‌పీ సురేష్, డీఆర్‌పీలు, కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు, పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్‌పై కేసు

ఖిలా వరంగల్ : వరంగల్ లక్ష్మీనగర్ శాకరాసి కుంట సమీపంలోని ఓ నిర్జీవ ప్రదేశంలో బుధవారం రాత్రి కారు పార్క్ చేసి మద్యం సేవిస్తున్న ఓ మాజీ కార్పొరేటర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైంది. మద్యం సేవిస్తూ పోలీసులను చూసి కారులో ముందుకెళ్తున్న ఆయనను పట్టుకుని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతడిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి గురువారం తెల్లవారు జామున వదిలేసినట్లు సీఐ టి. సురేష్ తెలిపారు. ఇదిలా ఉండగా ఆ మాజీ కార్పొరేటర్ రెండు నెలల క్రితమే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అల్లుడి దాడి.. అత్త మృతి

రామన్నపేట : అల్లుడి దాడిలో అత్త మృతి చెందింది. మట్టెవాడ ఎస్సై నవీన్ కథనం ప్రకారం వృద్ధురాలు సామల వెంకటమ్మ (78) తన నాలుగో కూతురు వంగ సునీతతో కలిసి వరంగల్ సుజాతనగర్‌లో నివాసముంటోంది. సునీత భర్త సంపత్ నిత్యం వెంకటమ్మను దూషించడంతోపాటు ఘర్షణకు దిగేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం సంపత్ తన భార్య, కొడుకును ఓ గదిలో ఉంచి వెంకటమ్మ తలపై సుత్తితో కొట్టాడు. తీవ్రగాయాలపాలైన వృద్ధురాలిని వెంటనే ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి పెద్ద కూతురు దేవులపల్లి శోభరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఎస్సై నవీన్ తెలిపారు.

చిగురించిన ఆశలు..

- టీచర్‌పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- డీఎస్సీతోనే నియామకం
- రెండు రోజుల్లో విధివిధానాలు ఖరారు?

విద్యారణ్యపురి: సుదీర్ఘకాలంగా టీచర్ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్న డీఎడ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులకు శుభవార్త. త్వరలోనే ఈ పోస్టుల భర్తీకి ఉపక్రమించబోతున్నట్లు విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి గురువారం వెల్లడించారు. అయితే ఈసారి టీఆర్‌టీ ద్వారా కాకుండా పాతపద్ధతి డీఎస్సీ ద్వారానే భర్తీచేయబోతున్నారు. రాతపరీక్ష అనంతరం జిల్లా సెలక్షన్ కమిటీ భర్తీ చేయనుంది. అందుకు రెండు మూడురోజుల్లో కలెక్టర్లు విధివిధానాలు ప్రకటిస్తారని సమాచారం. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఈడీ, డీఎడ్ పూర్తిచేసిన అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే టీచర్ ఎల్జిబులిటీ టెస్టు (టెట్) నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈఏడాది సెప్టెంబర్15న టెట్ నిర్వహిస్తారు. అదే నెలలో 27న ఫలితాలను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో టెట్‌కు అభ్యర్థులు ప్రిపేర్ అవుతున్నారు. ఇప్పుడు టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ కూడా రానుండడంతో ఆయా అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

జిల్లాలవారీగా ఎన్ని వెకెన్సీలు భర్తీచేస్తారు!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఎడ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు వేలాది మంది ఉన్నారు. దీంతో వీరు కొన్నేళ్లుగా టీచర్ పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్నారు. 2017లో టీఆర్‌టీ ద్వారా టీచర్ల పోస్టుల భర్తీ చేశాక మళ్లీ ఇప్పటి వరకూ జరగలేదు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరు జిల్లాలుగా హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి విభ



జించబడింది. ఈ నేపథ్యంలో ఏ జిల్లా నియామకాలు ఆ జిలాలోనే కొనసాగుతాయి. అయితే అభ్యర్థుల్లో వివిధ కేటగిరీల్లో ఎన్ని పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి.. అందులో ఎన్ని భర్తీ చేస్తారనే అంశం ఆసక్తిగా మారింది. రాష్ట్రంలో మాత్రం 5,089 టీచర్ పోస్టులు మాత్రమే భర్తీచేస్తారని, స్పెషల్‌ఎడ్యూకేషన్ లో1523 టీచర్‌పోస్టులు భర్తీచేయబోతున్నారని సమాచారం. అంతకంటే ఎక్కువగానే పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి వేకెన్సీలను భర్తీచేయబోతున్నారని సమాచారం.

హనుమకొండ జిల్లాలో 318 పోస్టులు ఖాళీ..

హనుమకొండ జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 2,693 పోస్టుల మంజూరు ఉండగా అందులో 2,375మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 318 పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. గ్రేడ్ 1 హెచ్ఎం పోస్టులు ఒకటి వేకెన్సీగా ఉండగా గ్రేడ్ హెచ్ఎంలు 46 ఉన్నాయి.ఎస్‌జీటీ తెలుగు మీడియం 74, ఉర్దూమీడియం 8 పోస్టులు వేకెన్సీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్స్ మ్యాథ్స్ 7, ఫిజిక్స్ 4, బయోసైన్స్ 17, సోషల్‌స్టడీస్ 38 , తెలుగు 9, హిందీ 8, ఉర్దూ 1, ఫిజికల్ ఎడ్యూకేషన్ 5, పీఎస్‌హెచ్‌ఎం 45,ఎల్‌పీ తెలుగు 2, ఎల్‌పీ హిందీ 3, పీఈటీ 6, ఆర్ట్ డ్రాయింగ్ టీచర్ 8, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్స్ 17, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ 4 వేకెన్సీలుగా ఉన్నాయి.

జనగామ జిల్లాలో 426 పోస్టులు..

జనగామ జిల్లాలో అన్ని కేటగిరీల కలిపి 426 టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. జిల్లాలో 2,570 కేడర్ స్ట్రెంత్ (పోస్టుల మంజూరు) ఉండగా అందులో 2,144మంది పనిచేస్తున్నారు.హెచ్‌ఎం పోస్టులు 49, పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు 57, స్కూల్ అసిస్టెంట్‌లు 167, ఎస్‌జీటీ పోస్టులు 118, పండిట్లు 21, పీఈటీలు 7వేకెన్సీలుగా ఉండగా ఇంకా వివిధ కేటగిరీలో పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి.

మహబూబాబాద్‌జిల్లాలో 595..

మహబూబాబాద్‌జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 595 టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి. జిల్లాలో 3,681 టీచర్ల కేడర్ స్ట్రెంత్ ఉండగా అందులో 3,086 మంది పనిచేస్తున్నారు.595 వేకెన్సీలుగా ఉన్నాయి. హెచ్‌ఎం పోస్టులు 39, పీఎస్‌హెచ్‌ఎం 70, మ్యాథ్స్ 20, ఫిజిక్స్ 8, బయోసైన్స్ 53, సోషల్‌స్టడీస్ 62, తెలుగు 18, హిందీ 10, ఇంగ్లిష్ 24, ఫిజికల్ ఎడ్యూకేషన్ 8 ఎల్‌పీ తెలుగు 14, ఎల్‌పీ హిందీ 5, పీఈటీ 2, ఎస్‌జీటీ పోస్టులు 262 వేకెన్సీలుగా ఉన్నాయి.

- వరంగల్‌జిల్లాలో అన్నికేటగిరీల టీచర్ పోస్టులుకలిపి 490వరకు వేకెన్సీలుగా ఉన్నాయని సమాచారం,
- ములుగు జిల్లాలో 300లకుపైగా టీచర్‌పోస్టులు వెకెన్సీలుగా ఉన్నాయని సమాచారం.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోఅన్ని కేటగిరీలు కలిపి 325కుపైగా టీచర్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయని సమాచారం. వేకెన్సీల్లో కొంతశాతం పదోన్నతుల ద్వారా, మరికొంత డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తారు.జిల్లా కలెక్టర్లు విధివిధానలను ప్రకటించాకా త్వరలోనే నోటిఫికేషన్ కూడా ఇస్తారనేది సమాచారం.

సర్కారు బడికే జై..

- తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన తహసీల్దార్
- అభినందించిన పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు

చిల్పూరు : ప్రస్తుత కాలంలో సామన్యుల నుంచి.. సంపన్నుల వరకు.. నిరక్షరాస్యుల నుంచి.. ఉన్నత విద్యావంతుల వరకు.. కిందిస్థాయి సిబ్బంది నుంచి.. ఉన్నతాధికారుల వరకు అందరూ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతబడే పరిస్థితులు నెలకొంటున్నాయి. అయితే వీరందరికీ చిల్పూరు తహసీల్దార్ సరస్వతి భిన్నం. తన కుమారుడు శ్రీవర్ధన్‌ను గురువారం మండల కేంద్రంలోని



కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న తహసీల్దార్ సరస్వతి

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతిలో చేర్పించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పేరు నమోదు చేసుకుని పుస్తకాలు అందజేసి తరగతిగదిలో కుర్చోబెట్టారు. దీంతో తహసీల్దార్‌పై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధాకృష్ణ, వేణు, మంజుల, వెంకటరమణాచార్య, ఎస్‌ఎంసీ చైర్మన్ పంతం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపు.. సీపీఎం ఆందోళన

రామన్నపేట : దేశాయిపేట శివారు ప్రభుత్వ భూమిలో వెలిసిన 1600 గుడిసెలను పోలీసులు బుధవారం అర్ధరాత్రి తొలగించారు. గుడిసెల తొలగింపుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రాస్తారోకో, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ పోలీసులు నిర్దాక్షిణ్యంగా గుడిసెలు నేలమట్టం చేశారని మండిపడ్డారు. గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం వెంటనే ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తయినా ఇండ్లు లేని నిరుపేదలకు ఇంత వరకు స్థలాలు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నలిగంటి



పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

రత్నమాల, సింగరాపు బాబు, ముక్కెర రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు సాగర్, అరూరికుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కబ్జారాయుళ్ల పై పీడీ యాక్ట్

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు కబ్జారాయుళ్లపై సీపీ రంగనాథ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏనుమాములలో నివాసముంటున్న జన్ను అనిల్, గీసుకొండ మండలం కీర్తినగర్ ప్రాంతానికి చెందిన పోలెపాక విజయ్‌పై పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీ సీఐలు శ్రీనివాస్, సురేష్ గురువారం హైదరాబాద్‌లోని చర్లపల్లి కారాగారంలో జైలర్ సమక్షంలో వారికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు. నిందితులు ఖాళీ స్థలాలపై కన్నేసి తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి వాటి ద్వారా అసలు స్థల యజమానులను బెదిరిస్తూ భూ కబ్జాలకు పాల్పడడంతో



నిందితులకు పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేస్తున్న సీఐలు

పాటు ఇబ్బందులకు గురిచేసేవారని తెలిపారు. ఈ తరహా కేసుల్లో జన్ను అనిల్‌పై ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలో రెండు, పోలెపాక సంజీవ్ పై మిల్స్ కాలనీ పీఎస్ పరిధిలో మూడు కేసులు నమోదైనట్లు తెలిపారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి : తెలంగాణ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల బలోపేతమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, రుణాలు పొందిన మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం పాలకుర్తిలో నిర్వహించిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ నేతృత్వంలో స్వయం సహాయక సంఘాలకు రూ. 20 వేల కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. ఇప్పటికే ప్రతీ మహిళకు రూ. 3 లక్షల రుణాలు అందజేశామన్నారు. ఈ డబ్బుతో మహిళలు వివిధ ఉపాధి మార్గాల ద్వారా ఆర్థికంగా ఎదిగారన్నారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల సంఘాల్లో 45 లక్షల పైగా సభ్యులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళ సంఘంలో సభ్యురాలిగా ఉండాలన్నారు. ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషాదయాకర్‌రావు మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం



మహిళాసంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి

మంత్రి ఎర్రబెల్లి.. మహిళా సంఘాల సభ్యులకు రూ. 5 కోట్లు విలువైన రుణాలు అందజేశారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీవో నూరోద్దీన్, ఎంపీపీ నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, ఆపరేషన్ ఎస్‌బీఐ షేక్‌అబ్దుల్ రహీం, మార్కెట్ చైర్మన్ ముస్కు రాంబాబు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, సహకార సొసైటీ చైర్మన్ బొబ్బాల అశోక్ రెడ్డి, వీరమనేని యాకాంతరావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రామన్నపేట : వరంగల్ లోకల్ బస్టాండ్ ఫ్లాట్‌ఫాం నంబర్-1 వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఇంతేజార్ గంజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటాడని తెలిపారు. సన్నగా నలుపురంగుతో ఆకుపచ్చ లుంగీ, గ్రే కలర్ చెక్స్ కలిగిన ఫుల్ షర్టు కలిగి ఉన్నాడని తెలిపారు. ఈ మృతదేహాన్ని వరంగల్ బస్టాండ్‌లో ప్యాసింజర్ గైడ్‌గా విధులు నిర్వహిస్తున్న గంజి రాజేందర్ గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో గుర్తించారన్నారు. సదరు వ్యక్తికి స్పృహ లేకపోవడంతో 108కు సమాచారం అందించినట్లు తెలిపారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మార్కెట్‌లోకి హెచ్‌పీ ఫ్లేమ్‌ప్లస్ గ్యాస్

హన్మకొండ అర్బన్ : నగరంలోని కమర్షియల్ గ్యాస్ వినియోగదారుల కోసం హెచ్‌పీ(హిందూస్థాన్ పెట్రోలియం) గ్యాస్ ఆధ్వర్యంలో వినూత్నంగా ఫ్లేమ్ ప్లస్ సిలిండర్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సంస్థ సౌత్ సెంట్రల్ జోన్ జీఎం మహేశ్ రామ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ ఫ్లేమ్ ప్లస్ సిలిండర్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లేమ్ ప్లస్ గ్యాస్ వినియోగంతో అధిక ఉష్ణోగ్రత, అధిక సామర్థ్యం, తక్కువ గ్యాస్ ఖర్చు అవుతుందన్నారు. సమపాళ్లలో ఉష్ణోగ్రత, మంట నిలకడగా రావడం వల్ల సమయం ఆదా అవుతుందని, తద్వారా 10 శాతం వరకు గ్యాస్ ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ డీజీఎం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మహేష్‌రామ్, గ్యాస్ డీలర్లు

మనోజ్ గోయల్, హెచ్‌పీ డీలర్స్ ఏ.వి సత్యమోహన్, పి.వెంకటేశ్వరరావు, రామకృష్ణ రాజు, మోహన్ రెడ్డి, రాజిరెడ్డి, రమేష్, శంకర్, మనుకార్తీ, శ్యాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య కేసులో దర్యాప్తు వేగవంతం

- బృందాలుగా వీడిన పోలీసులు..
- నిందితుల కోసం గాలింపు

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలో సంచలనం రేకెత్తించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి నాముతాబాజీ రాంచందర్(65) హత్య కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాలు మేరకు ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సీఐ సురేష్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్, స్టేషన్ పోలీసులు నాలుగు బృందాలుగా వీడి నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. వృద్ధుడిని హత్య చేసి పరారైన ఇద్దరు వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనంపై ఎటువైపు వెళ్లారు? బైక్‌ను ఎక్కడ పడేసి ఉంటారు? లేదా బైక్‌పై ప్రయాణం చేసి ఉంటారా? అనే అంశంపై దర్యాప్తు చేపడుతున్నారు. ఘటనా స్థలిలో క్లూస్ టీం సేకరించిన ఆధారాలను కూడా పోలీసులు పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడి కుమారుడు ప్రదీప్‌చందర్ పేర్కొనట్లు 'గతంలో పత్తిపాకశాయంపేటకు చెందిన ఓ వ్యక్తికి మృతుడు రాంచందర్ మధ్య భూ వివాదం కొనసాగుతోంది. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. భూ వివాదంలో భాగస్వామి అయిన వ్యక్తే రాంచందర్‌ను హత్య చేసి ఉంటాడా..?' అనే విషయాన్ని ఆరాతీస్తున్నారు. హత్యకు గురైన వృద్ధుడితో వివాదం ఉన్న వ్యక్తితో పరిచయం ఉన్న వ్యక్తులను కూడా విచారించి వదిలేసినట్లు తెలుస్తోంది. వృద్ధుడి కుటుంబ సభ్యులను కూడా పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని కూడా విడివిడిగా విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా, వృద్ధుడి హత్యకు సుపారీ ఇచ్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నవజాత శిశువు మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల ఆందోళన
- బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీసీహెచ్‌ఎస్ హామీ



పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు

పాలకుర్తి : ఓ నవజాతి శిశువు మృతి చెందింది. ఈ ఘటన పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. మండలంలోని దర్దేపల్లి గ్రామానికి చెందిన జిట్ట బోయిన రామలీల, సోమమల్లయ్య దంపతుల కూతురు స్రవంతికి జఫర్‌గఢ్ మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం స్రవంతి గర్భం ధరించి ప్రసూతి నిమిత్తం తల్లిందడ్రుల వద్ద ఉంటోంది. ఈ క్రమంలో గురువారం పురిటి నొప్పులు రావడంతో పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఈ సమయంలో డాక్టర్ స్వప్న అందుబాటులో లేరు. దీంతో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్స్ సరిత మైనర్ ఆపరేషన్ చేసింది. అయితే శిశువుకు చలనం లేకపోవడంతో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శిశువు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు.

స్టాఫ్ నర్స్ ఆపరేషన్ చేయడంతోనే శిశువు మృతి..

డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేని సమయంలో స్టాఫ్ నర్స్ ఆపరేషన్ చేయడంతోనే శిశువు మృతి చెందిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలిసిన డీసీహెచ్‌ఎస్ సుగుణాకర్‌రాజు, ఏసీపీ సురేష్, సీఐ విశ్వేశ్వర్, ఎస్ఐ శ్రీకాంత్ హుటాహుటినా పాలకుర్తి ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.

పెన్షన్ కోసం వెళ్లి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



బుచ్యా(ఫైల్)

ఖానాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని మంగళవారిపేటలో జరిగింది. నాజీతండాకు చెందిన అజ్మీరా బుచ్యా(81), భద్రు పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి ద్విచక్ర వాహనంపై తండా నుంచి మంగళవారిపేటకు వచ్చారు. డబ్బులు తీసుకుని వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మహబూబాబాద్ వైపు నుంచి నర్సంపేట వైపునకు వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో బుచ్యాకు తీవ్ర గాయాలుకావడంతో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కక చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, భద్రుకు స్వల్ప గాయాలు కావడంతో నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవ్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నీలిగొండ వీరాంజన్(32) గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు వేరే ఊరికి వెళ్లి తిరిగి వచ్చి చూడగా వీరాంజన్ ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. కాగా, నేలపై, మృతుడి కాళ్లకు రక్తం మరకలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళ అదృశ్యం

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన ఎడ్ల శ్రీలత తన కూతురుతో కలిసి గురువారం అదృశ్యంది. బుధవారం ఉదయం కూతురును పాఠశాలకు తీసుకెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన శ్రీలత తిరిగి రాలేదు. దీంతో బంధువులు, చుట్టుపక్కల వెతకగా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.